క్లుప్తంగా

స్వామిత్వ సర్వే శాస్త్రీయంగా సాగాలి



అంగర సచివాలయంలో ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే శాస్త్రీయంగా సాగాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశించారు. మండలంలోని అంగర, వల్లూరు గ్రామాల్లో మంగళవారం చేపట్టిన సర్వే జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల సమక్షంలో సర్వేను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

రామచంద్రపురం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల(టారిఫ్)పై ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తునట్లు ఏపీఈపీడీసీఎల్ డీఈ దాట్ల శ్రీధర్ వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ అధికారులతో పాటుగా ఏపీ ఇంధన శాఖ, ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. అభిప్రాయాలు చెప్పదలచుకున్న వారు రామచంద్రపురం డివిజన్ కార్యాలయం ఈఈ ఆఫీసు ద్వారా పాల్గొనొచ్చని తెలిపారు.

వైభవంగా ప్రభల తీర్థం

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రబల తీర్థం వైభవంగా సాగింది. కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, అంగర, టేకి, కోరుమిల్లి తదితర గ్రామాల దేవతామూర్తుల ఆలయాల నుంచి ప్రభలు ఊరేగింపుగా గ్రామాల వీధులు మీదుగా సాగాయి. ఆయా గ్రామాల ప్రభలు మాచర గ్రామ శివారు శ్రీరాంపురం చెరువు సమీపాన క్షేత్రానికి చేరుకున్నాయి. ప్రబలకు భక్తులు పూజలు చేశారు. అక్కడ నిర్వహించిన తీర్థంలో విద్యార్థులు, భక్తులు సందడి చేశారు.

ఘనంగా గోగులమ్మ జాతర

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు గ్రామ శివార్లు ముచ్చెరువు, గణపతినగరం, మట్ల చెరువు గ్రామాల్లో గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తీర్థం

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సోమవారం జాతర నిర్వహించి గరగలను గ్రామంలో ఊరేగించారు. గ్రామ సర్పంచ్ పలివెల లోవరాజు, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

24న పోలమ్మతల్లి ఉత్సవాలు

రాయవరం: రాయవరం పరిసర గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే పోలమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మంగళవారం తెలిపారు. రాయవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22వ తేదీన ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాన్ని, 23, 24 తేదీల్లో పోలమ్మ అమ్మవారి జాతర, తీర్థం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. 24న జరిగే జాతరను భారీస్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజయనగరం, విశాఖపట్టణం, ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

కపిలేశ్వరపురం: ఈ నెల 19న వాకతిప్ప పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి పి.చంద్రమౌళి మంగళవారం తెలిపారు. పీహెచ్‌సీలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ఆసుపత్రి నిర్వహణపై, రోగులకు అందిస్తున్న సదుపాయాల మెరుగుదలపై చర్చించనున్నట్టు చెప్పారు.

రేపు వలంటీరు ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలెం, తోటపేట, వెల్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టుల భర్తీకి గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని హాజరు కావాలని కోరారు.

గడప చెంతకు చేరిన అభివృద్ధి

- మెర్నిపాడు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- దశాబ్దంన్నర కాలం నాటి సమస్యకు పరిష్కారం
- వెతలు తీర్చిన గడప గడపకూ మన ప్రభుత్వం



కాలనీలో సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం

మండపేట: రోడ్లు, డ్రైన్లు లేక తాము పడుతున్న వెతలు తీర్చమని కాలనీవాసులు ఏళ్ల తరబడి పాలకులు, అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మూడు నెలల క్రితం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాలకులు ఆ కాలనీలో పర్యటించారు. స్థానికుల కష్టాల్ని కళ్లారా చూశారు. వెంటనే స్పందించి దశాబ్దంన్నర కాలంగా వారిని వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపారు. దీంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.

2006లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు మండలంలోని మెర్నిపాడులో సుమారు 50 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గృహనిర్మాణ రుణాలు మంజూరు చేయగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆయన అకాల మరణంతో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు తదితర మౌలిక వసతుల పనులు జరగలేదు. తర్వాత వచ్చిన పాలకులు వసతుల కల్పనకు చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. డ్రైన్లు లేకపోవడంతో ఇళ్లలోని వాడకం నీరు రోడ్లపైకి చేరి రోడ్లు మురికికూపాన్ని తలపించేవి. వర్షం వస్తే సమస్య మరింత జటిలంగా మారి మోకాలు లోతు నీటిలోంచి రాకపోకలు సాగించాల్సి వచ్చేది. తాగునీటి కోసం దూరంగా వెళ్లాల్సి వచ్చేది. తమ కాలనీలో కనీస వసతులు కల్పించాలని ఎన్నోమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు అంటున్నారు. 15 ఏళ్లుగా అపారిశుధ్యం, పాముల బెడద, దోమలతో దుర్భరజీవనం సాగించామని ఆవేదన వ్యక్తం చేశారు.

పండగ నాటికి పరిష్కరిస్తానని మాటిచ్చి..

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గత సెప్టెంబర్ నెలాఖరున గ్రామ సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు, సర్పంచ్ సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న వసతుల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సంక్రాంతి పండగ నాటికి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్సీ తోట వారికి హామీ ఇచ్చారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయ నిధుల నుంచి రూ.18 లక్షలు మంజూరు చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్లు, డ్రైన్ల పనులు సంక్రాంతి పండగకు రెండు రోజులు ముందుగానే పూర్తి చేశారు. ఇంటింటికీ రక్షిత నీటిని అందించేందుకు వాటర్ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీఓ ఐ.రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, పిల్లా వీరబాబు పరిశీలించారు. మాట ఇచ్చినట్టుగానే ఇంత వేగంగా తమ వెతలు తీర్చడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎందరినో వేడుకున్నా ఫలితం లేదు



15 ఏళ్లుగా కనీస వసతులు లేక కాలనీలో దుర్భర జీవనం సాగిస్తున్నాం. రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ఎంతో మందిని వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. మూడు నెలల క్రితం మా వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చెబితే ఆయన వెంటనే స్పందించి పరిష్కరించారు.

– కాగితపల్లి దుర్గమ్మ, కాలనీవాసి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



కాలనీ అభివృద్ధికి సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు ఎంతో కృషిచేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాకు మాట ఇచ్చినట్టుగానే మా కాలనీలో రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. కాలనీవాసులం ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– నేరేడుమిల్లి విజయ, కాలనీవాసి

పేదలకు భరోసానిచ్చే ప్రభుత్వమిది



రామచంద్రపురం పట్టణంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- రామచంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి ప్రజలకు భరోసాను కల్పించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం మంత్రి వేణు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన అందుతుందని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణాన్ని స్వచ్ఛ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. దాంట్లో భాగంగానే ఇంటింటికీ మొక్కలను అందిస్తామన్నారు. పుర ప్రజలు స్వచ్ఛ రామచంద్రపురంకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, స్థానిక కౌన్సిలర్ బొక్క వీరవెంకట సత్యనారాయణ, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కేతా శ్రీను, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు మల్లిడి సత్తిరెడ్డి, సత్తిశంకర్‌రెడ్డి, దొమ్మలపాటి సత్యనారాయణ, రెడ్నల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి మైక్ సెట్ కోసం విరాళం



మైక్ సిస్టం కోసం నగదును అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

మండపేట: మండలంలోని అర్తమూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి మైక్‌సిస్టం కోసం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి, సీతాయమ్మ దంపతులు రూ.50 వేలు కానుకగా అందజేశారు. తొలుత ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, సభ్యులు ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, కర్రి అబ్బాయిరెడ్డి, తాడి రామారెడ్డి, చిర్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి ఆదిరెడ్డికి ఘన సత్కారం



ఆదిరెడ్డి గురుస్వామి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

రాయవరం: సోమేశ్వరం గ్రామానికి చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి(ఆదిరెడ్డి గురుస్వామి)ని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆయన నవంబరు 26న శబరిమలకు కాలినడకన బయలుదేరి 50 రోజులు పాటు 1,370 కిలోమీటర్లు పయనించి శబరిమల యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. గ్రామానికి చేరుకున్న ఆదిరెడ్డి గురుస్వామిని ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయ నిర్మాత కనకరాజు, వైఎస్సార్ సీపీ నేత దూళిపూడి వెంకటేశ్వరరావు, గరగ శ్రీనివాసరావు, గరగ సోమన్న, కర్రి భామిరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, జరజాపు లక్ష్మణస్వామి తదితరులు ఘనంగా సత్కరించారు.

శెట్టిబలిజ సంఘం సాయం

రామచంద్రపురం: అగ్ని ప్రమాదంలో జీవనోపాధి కోల్పోయిన కుటుంబాన్ని హైదరాబాద్ శెట్టిబలిజ సంఘం సభ్యులు ఉదారంగా ఆదుకున్నారు. కాజులూరుకు చెందిన రెడ్డి సూర్యనారాయణ హైదరాబాద్‌లో చిరుద్యోగం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలపాలై జీవనోపాధిని కోల్పోయాడు. దీంతో స్పందించిన హైదరాబాద్‌కు చెందిన శెట్టిబలిజ సంఘం నాయకులు రూ.1.50 లక్షలు సమకూర్చి రామచంద్రపురంలో మంత్రి వేణు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన శెట్టిబలిజ సంఘ సభ్యులు, కాజులూరు మండల శెట్టిబలిజ సంఘం నేతలు పాల్గొన్నారు.



సూర్యనారాయణకు చెక్కును అందజేస్తున్న మంత్రి వేణు

క్రికెట్ టోర్నమెంట్ విజేత వాడపల్లి జట్టు



అంగరలో టోర్నమెంట్ విజేత జట్టుకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: అంగరలో సిద్ధిరెడ్డి నరసబాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గత 12 రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వాడపల్లి జట్టు నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు కె.గంగవరంపై 8 వికెట్ల తేడాతో వాడపల్లి జట్టు కప్ గెలుచుకుంది. విజేత జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, నిర్వాహకులు చేతుల మీదుగా అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కె.గంగవరం జట్టుకు రూ.15వేలు నగదు బహుమతి, జ్ఞాపికలను పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో అనేక సామాజిక కార్యక్రమాలను చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న సిద్ధిరెడ్డి నరసబాబు జ్ఞాపకార్థం నిర్వహించిన టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు వంగా నల్ల శ్రీను, వాసంశెట్టి వాసు, పాలింగి కిశోర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విన్నర్స్‌గా నిలిచిన డిజర్ట్ ఈగల్స్ టీమ్

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజుల పాటు నిర్వహించిన బీఎస్‌పీ మెమోరియల్ ఆర్‌పీఎల్ సీజన్–6 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ఘనంగా ముగిసింది. ఈ నెల 13న ప్రారంభమైన పరిమిత ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్‌లో ఐదు టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో హోరాహోరీగా జరిగిన పోటీలో డిజర్ట్ ఈగల్ విన్నర్స్‌గా, రాయల్ వారియర్స్ రన్నర్స్‌గా నిలిచాయి. విన్నర్, రన్నర్స్ టీమ్‌లకు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులతో పాటుగా ట్రోఫీలను అందజేశారు. విన్నర్స్, రన్నర్ టీమ్‌లకు ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టరు తేతల సుబ్బరామారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మంతెన అచ్యుతరామరాజు, పడాల కమలారెడ్డి తదితరులు చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు.

పలకరింపులు.. పులకరింతలు

- రాయవరంలో 'అపూర్వ' కలయిక
- స్నేహగీతం ఆలపించిన 1990–95 బ్యాచ్ విద్యార్థులు



గురువులను సత్కరిస్తున్న 1990–95 బ్యాచ్ విద్యార్థులు

రాయవరం: చూడవే.. మాధవి అప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు అలాగే ఉంది అని ఒకరంటే.. సుజాతను చూడు ఎంతగా మారిపోయిందో అంటూ మరో స్నేహితురాలు చెణుకులు. ఒరేయ్ ఆ వచ్చేవాడు వెంకటరెడ్డి కదా.. ఎంత మారిపోయాడురా.. మన బ్యాచ్‌మేట్ కృష్ణారెడ్డి డాక్టర్ అయ్యాడంట కదా.. మునిరెడ్డి అప్పుడెలా ఉన్నాడో ఇప్పుడు అలాగే ఉన్నాడురా.. ఇలా సాగింది 25 ఏళ్ల తరువాత కలుసుకున్న చిన్ననాటి మిత్రుల సంభాషణ.. చదువుకునే రోజులనాటి తీపి గుర్తులను, మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్నేహితులందరూ ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల 1990–95 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో కలుసుకుని స్నేహ బంధం ఎంత మధురమంటూ స్నేహగీతం ఆలపించారు.

ఎటు చూసినా సందడే

రెండున్నర దశాబ్దాల క్రితం పదో తరగతిలో విడిపోయిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలవడంతో పాఠశాలలో సందడి వాతావరణం కనిపించింది. చెన్నై, బెంగళూర్, హైదరాబాద్, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నవారు తమ కుటుంబ సభ్యులతో వచ్చి మిత్రుల్ని కలుసుకున్నారు. కొందరు ఏళ్ల తరువాత తమ చిన్ననాటి మిత్రుల్ని చూసి అమితానందానికి గురయ్యారు. గురువులను సత్కరించుకున్న అనంతరం విద్యార్థులంతా గ్రూపు ఫొటో దిగారు. తమ కలయికకు కారకులైన పూర్వ విద్యార్థులు తేతల శ్రీనివాసరెడ్డి, పేకేటి వీరబాబు, కర్రి వెంకటరెడ్డి, పీవీఎస్‌డీ నాగమణిలను మిగిలిన మిత్రులంతా అభినందించారు.

ఎప్పుడూ ఊహించలేదు



పదో తరగతి తరువాత ఎవరి దారి వారిదైంది. మళ్లీ ఇలా కలుస్తామని ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది. అప్పటి మిత్రులతో పాటు, ఉపాధ్యాయులను కూడా చూసిన ఆనందంతో తిరిగి వెళ్తున్నాను. – వాసంశెట్టి మాధవి, పూర్వ విద్యార్థి, విశాఖపట్నం

ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను



మిత్రులందరినీ కలుసుకున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. నాటి స్నేహితులందరినీ ఒకే చోటకు చేర్చిన మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. బాధ్యతగా తీసుకుని అందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చారు.

– కర్రి వెంకటలక్ష్మి, పూర్వ విద్యార్థి, హైదరాబాద్

కష్టానికి తగిన ఫలితం దక్కింది



నాలుగు సెక్షన్లకు చెందిన 160 మంది స్నేహితుల నంబర్లను సేకరించి, వారందరినీ ఒకే చోటకు చేర్చాం. దాని కోసం పడిన శ్రమ అందరినీ చూశాక మరిచిపోయాను. కష్టానికి తగిన ఫలితం దక్కింది.

– కర్రి వెంకటరెడ్డి, పూర్వ విద్యార్థి, కొమరిపాలెం

సంక్రాంతి పోటీలతో సందడి



వెదురుమూడిలో జరిగిన పోటీల్లో ముగ్గు వేస్తున్న యువతి

కపిలేశ్వరపురం: గ్రామాలు సంక్రాంతి పోటీలతో సందడిగా మారాయి. వెదురుమూడిలో నక్కా నరేష్, నెల్లి అంబేద్కర్, బీర విజయ్, సంఘ పెద్దలు పర్యవేక్షణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ముగ్గులు, సైకిల్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఆవరణలో నిర్వహించిన పోటీల్లోని విజేతలకు నక్కా సింహాచలం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పడమర ఖండ్రికలో సువర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లోని విజేతలకు సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరావు తదితరుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ముత్యాలమ్మని దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఎమ్మెల్సీ తోటకు స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

మండపేట: మండలంలోని మెర్నిపాడులో వేంచేసియున్న ముత్యాలమ్మ వారిని మంగళవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గత రెండు రోజులుగా అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్సీ తోట పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆయనకు గ్రామ సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఆలయ కమిటీ సభ్యులు వల్లూరి చినబాబు, ముత్యాల పెద్దబ్బు, గారపాటి శ్రీసతీష్, యరమాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



ఆలయంలో హైకోర్టు జడ్జి చక్రవర్తి తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో ఛాయా సోమేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి చక్రవర్తితో పాటు వారి కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామలింగేశ్వరరావు, పప్పుల మసేను వెంకన్న, అర్చకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

హైకోర్టు జడ్జి చక్రవర్తిని మర్యాద పూర్వకంగా కలిసిన జీవీరావు

రామచంద్రపురం: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తిని కె.గంగవరం మండలం పేకేరులో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు స్థానిక విలేకరులకు తెలిపారు. తమ కుటుంబంతో చిరకాలంగా ఉన్న అనుబంధం కారణంగా చక్రవర్తి, ఆయన సతీమణి హరితలను కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ చక్రవర్తికి గౌరవపూర్వకంగా న్యాయ తేజస్వి పేరుతో మెమోంటోను అందజేసినట్లు జీవీరావు తెలిపారు.



పసలపూడిలో 2006–07 బ్యాచ్ విద్యార్థుల గ్రూపు ఫొటో

పసలపూడిలో పూర్వ విద్యార్థుల సందడి

రాయవరం: మండలంలోని పసలపూడిలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2006–07 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులను సత్కరించుకుని, చివరగా గ్రూపు ఫొటో దిగారు.

మండలంలోని పసలపూడిలో 2010–11 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. వై.మణికంఠ, ఎస్.విజయ్, పి.కేదార్, కె.సురేష్, కె.మంగిరెడ్డి తదితరులు స్నేహితుల కలయికకు కృషి చేశారు. ఒకరికొకరు పరిచయాలు చేసుకుని, ఎవరెవరు ఏ స్థాయికి చేరుకున్నారో తెలిపారు. చివరగా మిత్రులంతా మరోమారు గ్రూపు ఫొటో దిగారు.